వేంకటశర్మ, మంగిపూడి, 1882-1943

బాల వితంతు విలాపము

తణుకు, 1929

Record no. 180

Vēṅkaṭaśarma, Maṅgipūḍi, 1882-1943

Bāla Vitantu Vilāpamu

Taṇuku, 1929

Record no. 180

SUNDARAYYA VIGNANA KENDRAM

1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

Bibliographic Record Target

వేంకటశర్మ, మంగిపూడి.

బాల వితంతు విలాపము / మంగిపూడి వేంకటశర్మ.- 5. కూర్పు.- తణుకు : అధరాపురపు వాసుదేవరావు, 1929.

73p. ;18 cm.

Record no. 180

Vēṅkaṭaśarma, Maṅgipūḍi.

Bāla Vitantu Vilāpamu / Maṅgipūḍi Vēṅkaṭaśarma.- 5. kūrpu.- Taṇuku : Adharāpurapu Vāsudēvarāvu, 1929.

73p. ;18 cm.

Record no. 180

35 mm microfilm

Image placement: IA (IIA) IB IIB Date filming began:

బాల వితంతు వివాహము,

7.8.49.
26.9.49
26.11.49
13.1.50
8.5.51
8.11.51.
2.3.52
17.6.58
21.1.65

బాల వితంతు విలాపము.

మంగిపూడి వేంకటశర్మ
విరచితము.

ఐదవ కూర్పు.

అధరాపురపు వాసుదేవరావుచే
శ్రీ సౌదామినీ ముద్రాయంత్రశాలను ముద్రితము
తణుకు.

౧౯౨౧.

[దీని వెల ౬ అణాలు.

బాల వితంతు విలాపము.

సీ. శృంగారవతికి ముంగొంగు బంగారంబు
కీరభాషిణికిఁ దంగేటిజున్ను
కిసలయాధరకు ముంగిటి కల్పభూజంబు
పువ్వుఁబోణికిఁ బూలదండ
హరినీలవేణికి నరచేతిరత్నంబు
ధవళలోచనకు సుధారసంబు
యువతికిఁ బెరటిలో నున్న వేలుపుటావు
లలనకు నిత్యకల్యాణశోభ
గీ. పూజ్యచరితకు దివ్యసామ్రాజ్యపదవి
ప్రాణనాథుండు సతి కట్టిపతియె లేని
జాణతన మేల? సొగసేల? సౌఖ్య మేల?
జవ్వనం బేల? జగ మేల? జన్మ మేల? ౧

సీ. లలనల యానంద లతలకు మూలంబు
చెలువల సంతోసములకు వసతి
ప్రమదల సౌఖ్యసంపదలకు సదనంబు
నెలతల యుత్సాహములకు నెలవు

కాంతల రాగభోగముల కాధారంబు
తరుణుల శుభపరంపరల బరణి
ముదితల సౌందర్యముల కలంకారంబు
భామల సౌభాగ్య భాగ్యసీమ
గీ. స్త్రీల జీవనములకు సంజీవికరణి
జీవితేశ్వరుఁ డతని బాసిన పురంధ్రి
జాణతన మేల? సొగ సేల? సౌఖ్య మేల?
జవ్వనం బేల? జగ మేల? జన్మ మేల? ౨

సీ. ధన మేల? నెఱజాణతన మేల? బలుగాణ
తన మేల? పతిలేని తరుణులకును
విరు లేల? వెలలేని సరు లేల? దరిలేని
సిగు లేల? పతిలేని చెలువలకును
హితు లేల? ప్రియబంధు తతు లేల? గుణసింధు
సుతు లేల? పతిలేని సుదతులకును
నగ లేల? జిగిఁజిల్కు తొగ లేల? తమిఁగుల్కు
వగ లేల? పతిలేని వనితలకును
గీ. భోగ్యవస్తువులవియేల? భాగ్య మేల?
రాజ్యమదియేల? ప్రాజ్యసామ్రాజ్య మేల?
క్రీడలవియేల? మిద్దెలు మేడ లేల?
విద్యలవియేల? పతిలేని వెలఁదులకును. ౩

సీ. పూర్ణచంద్రునివంటి ముఖవిలాసముగల్గి
కలువరేకుల నేలు కనులుఁగల్గి
మహితచంద్రికఁబోలు మందహాసముగల్గి
యిరులఁ గేరడమాడు కురులుగల్గి
తమ్మికెంపులమించు దంతకాంతులుగల్గి
నవచంపకము గేరు నాసగల్గి
చిగురుటాకుల గెల్వఁదగు కరంబులుగల్గి
మేల్మిబంగరుచాయ మేనుఁగల్గి
గీ. చిలుకవలె ముద్దు చిలికెడు పలుకుఁగల్గి
నెఱతనము గల్గి విద్యల నేర్పుగల్గి
మగఁడులేకున్న యట్టి యమ్మగువసొగసు
అడవిఁగాచిన వెన్నెల యగును గాదె? ౪

సీ. చంద్రికలేనట్టి చంద్రుని చందంబు
నీరులేనట్టి కాసారమట్లు
కీలూడినట్టి పాంచాలిక పోలిక
జీవకళయెలేని చిత్రమట్లు
ప్రాణంబులేని కాయంబు విధంబున
కలికి పల్కులులేని చిలుకరీతి
తంతులులేని నిద్దంపు వీణకైవడి
తళుకులేనట్టి యద్దంబుకరణి

గీ. పక్షయుగ్మంబు తెగినట్టి పక్షిభంగి
చారుచాపంబు లేనట్టి నారితీరు
చక్రములఁబాసి యున్నట్టి శకటమట్లు
విభుఁడులేనట్టి వెలఁదియు వృథయెగాదె? ౫

సీ. అన్నంబు సున్నంబు హారంబు భారంబు
కేకులు కాఁకులు గృహము గ్రహము
దీపంబు తాపంబు రూపంబు పాపంబు
సరసంబు విరసంబు జగము నగము
చూతంబు భూతంబు శుకములు బకములు
గారంబు ఘోరంబు కథలు వ్యథలు
ప్రియంబు హేయంబు పలుకులు ములుకులు
కిసలముల్ ముసలముల్ పసిఁడి ముసిఁడి
ఆ. వె. పికము వృకము లతలు వెతలు మణుల్ ఫణుల్
నగలు సెగలు తొగలు పగలు పువులు
పవులు చెలులు పులులు వసనముల్ వ్యసనముల్
బ్రతుకె యతుకు విగతపతికలకును. ౬

సీ. చక్కఁదనంబున్న జవ్వనంబున్నను
బతిలేనికాంత జీవితము గతము
జాణతనంబున్న గాణతనంబున్నఁ
బతిలేనికాంత జీవితము గతము

అతులభాగ్యంబున్న నారోగ్యమున్నను
బతిలేనికాంత జీవితము గతము
ఆప్తబంధువులున్న నాత్మమిత్రములున్నఁ
బతిలేనికాంత జీవితము గతము
గీ. వివిధవిధ వైభవములున్న వినయమున్న
విద్యలను నేర్చియున్న వివేకమున్న
స్థిరతర సుకీర్తియున్న సుశీలమున్న
క్షితినిఁ బతిలేనికాంత జీవితము గతము. ౭

సీ. వరునిఁ బూజింపని కరములు కరములే?
రసహీన శాఖోత్కరములుగాక
సఖునితో సరసంబు సల్పఁజాలనివాయి
వాయియే? బలుపాడుగోయిగాక
విభునిభాషణములు వినలేని యాచెవుల్
చెవులగునే కొండగవులుగాక
ప్రాణేశునందంబుఁ బరికింపఁగాలేని
కనులు కన్నులె? దోషఖనులుగాక
ఆ. పతికి సుఖముగూర్చు భాగ్యంబుఁ గాంచని
మేను మేనె? పెద్దమ్రానుగాక
భర్తతోడిసుఖముఁ బడయంగలేని జీ
వనము జీవనంబె? వనముగాక. ౮

సీ. కబళంబు భుజియింపఁగా జిహ్వ కింపౌనె?
విభుఁడు లేనట్టి యీ వెలఁదులకును
అరఁగంటనేని నిద్దుర నొందవచ్చునే?
మగఁడు లేనట్టి యీ మగువలకును
మదికి నెమ్మది యొక్కమాత్రైనఁ గల్గునే?
ధవుఁడు లేనట్టి యీ తరుణులకును
సఖులసాన్నిధ్యంబు సౌఖ్యంబు గూర్చునే?
యధిపతి లేని యీ యబలలకును
గీ. తరమె? చల్లార్ప ఘోరసంతాపవహ్ని
రమణుఁడే లేని యీనవప్రమదలకును
నిల్పశక్యమె? తను వరనిముసమైన
నధిపుఁడే లేని యవ్విశాలాక్షులకును.

సీ. మనుజులం దన్యోన్యమైత్రి బాంధవ్యముల్
కలుగుటకై యేది కారణంబొ?
పశుసమానులు గాక ప్రజలెల్ల సుమతులై
క్రాలుచుండుట కేది కారణంబొ?
స్త్రీపురుషులు చెల్మిచేఁ గట్టువడుచు నై
క్యమున నొప్పుట కేది కారణంబొ?
పురుషులున్ స్త్రీలు పరస్పరముఁ గార్యములందుఁ
గైదోడగుట కేది కారణంబొ?

గీ. అట్టిపరిణయ బంధంబునందు దూర
దృష్టి భవితవ్యమును విచారింపఁబోక
పైకమిచ్చిన వారికే బాలికలను
గట్టిపెట్టుట యిది యెట్టికర్మ? మకట! ౧౦

సీ. దేహదార్ఢ్యముగల్గు ధీరు లుద్భవమందఁ
దగినసాధనము సత్పరిణయంబు
అనుపమానకుశాంకురాగ్రబుద్ధులుగల్గఁ
దగినసాధనము సత్పరిణయంబు
జన్మదేశావనోత్సాహ చిత్తులుగల్గఁ
దగినసాధనము సత్పరిణయంబు
మాతృసేవకరత్న మాణిక్యములుగల్గఁ
దగినసాధనము సత్పరిణయంబు
గీ. అట్టిపరిణయములఁ జేయు పట్టులందు
నీడు జోడును మున్నుగాఁ జూడఁబోక
పైకమిచ్చినవారికే బాలికలను
గట్టిపెట్టుట యిది యెట్టికర్మ? మకట! ౧౧

సీ. ఐకమత్యముఁ గూర్చి యువనీతలము నెల్లఁ
గట్టఁగాఁజాలు పగ్గంబు పెండ్లి
ఇహపరలోక సౌఖ్యైకదాయకముగాఁ
దనరాగు మేటిసాధనము పెండ్లి

కాలక్రమాగత కష్టసాగరముల
దాఁటింపజాలినతరణి పెండ్లి
ఆమయదుఃఖంబు లణఁచి సౌఖ్యంబుగా
జీవింపఁజేయు సంజీవి పెండ్లి
గీ. అట్టి పెండ్లిండ్లు చేసెడు పట్టులందు
సూక్ష్మమతి దూరదృష్టులఁ జూడఁబోక
దంపతుల భావిగతులఁ దలఁపఁబోక
వేగిరింతురు కొందఱు వెఱ్ఱు లకట! ౧౨

సీ. వైవాహికంబు లెవ్వరిసౌఖ్యసంతోష
ములనిమిత్తములుగాఁ దలఁపఁబడెనో?
వానిలోపమున నెవ్వరు కలకాలంబుఁ
గష్టనష్టములొందఁ గలుగువారో?
తమజీవితమున సాధకబాధకములను
దలపోయ నెవ్వారు తగినవారో?
ఐహికదుఃఖ సౌఖ్యంబులం దెవ్వారు
తగఁ బాలుపంచుక తనరువారో?
గీ. అట్టిదంపతుల పరస్పరాభిలాష
నెమ్మిఁ గనుఁగొనకయె యక్రమమ్ముగాను
దల్లిదండ్రులె స్వాతంత్ర్య మెల్లదాల్చి
చేయుచున్నారు పెండ్లిండ్లు చెనఁటులకట! ౧౩

సీ. పొత్తిళ్ళలోనున్న నెత్తురుకందుల
పెండ్లిండ్లుసేయ భావించునొకఁడు
పురుడు పోవకమున్నె బొట్టెల నమ్మంగ
బేరసారములు గావించునొకఁడు
కన్నులు తెఱవని కసుగాయలను గట్టి
పెట్టి వృద్ధులను సేవించు నొకఁడు
పాలైన విడువని పసికూనలను గూర్ప
మించుదళారి రావించు నొకఁడు
ఆ. వె. అమ్మ తాత యత్త యనుతొక్కుపల్కులే
పలుకలేని చిన్ని పాపలకును
రాము! రాము! ముందు రానున్న దెంచక
చెనఁటియగుచుఁ బెండ్లిసేయు నొకఁడు. ౧౪
సీ. మంచి సంబంధంబు మఱి వచ్చునో? లేదొ?
యంచు లోలో సంశయించి యొకఁడు
కట్నంబు ముం దింతకంటెను నధిక మీ
వలయునో? యంచు భీతిలి యొకండు
మనము పూర్వాచారమును మానఁగానేల?
యంచుడెందమున యోజించియొకఁడు
చిన్ననాఁడే పెండ్లి చేసిన గుణవంతు
లై ప్రతిష్ఠను దెత్తు రంచు నొకఁడు

గీ. పెండ్లిలోపలఁ బెండ్లి గావింతుమేని
కలసి వచ్చును కర్చని తలఁచి యొకఁడు
దంపతుల భావి సౌఖ్యముల్ దలఁప బోక
చేయుదురు పెండ్లి మూర్ఖులై చిఱుతలకును.

సీ. కన్నులారంగ మాంగల్య ధారణము నె
ప్పుడు చూతునో? యంచుఁ బొంగిపొంగి.
చేతులారఁగఁ బెండ్లి చేయఁగల్గుట యెన్నఁ
డో? యంచు నువ్విళులూరి యూరి
చెవులార విను టెప్డొ? చిన్న యల్లుఁడు పల్కు
మృదువాక్కులనుఁ గోర్కి మించి మించి
మనమారఁ జుట్టాలఁ దనియింతు విందుల
చే నెప్డొ? యని యూహ చేసి చేసి
ఆ. వె. భూరి దక్షిణలను భూమీసురులఁ దన్పి
యశము గాంచు టెప్డొ? యని ముదమునఁ
దోఁగి తోఁగి త్వరను బాగోగు లరయక
చేయుచుందు రిపెండ్లి చిఱుతలకును. ౧౬

సీ. గడప యెప్పుడు వచ్చఁ గానో? యని చూడ
వాచి యున్నవి నాదు లోచనములు
ద్వారమం దెన్నఁడు తోరణం బుందునో?
యని చూడ ముచ్చట యగును నాకు

వియ్యంపు నడపులు వేడ్కతో నడుపంగ
సారె సారెకుఁ గోర్కి సాగు నెపుడు
వలనుగా మన పాప తలఁ బ్రాలు చూడంగ
నుల్లముం దువ్విళు లూరుచుండు
గీ. కాంక్ష దీఱంగ నల్లుని కాళ్ళు గడిగి
ధన్యతను గన్యకను బ్రీతి ధారపోయు
వేడుకను జూడవలెనని విభుని వేఁడి
చేయుదురు పెండ్లి ముగ్ధలు చిఱుతలకును. ౧౭

ముద్దు ముచ్చట దీఱ ముక్కు ముక్కరనైనఁ
బెట్ట డీమగఁడంచుఁ దిట్టి తిట్టి
గడనలో నగలకై గన్వైన మిగులదు
నడపీనుఁ గితఁడంచు నవ్వి నవ్వి
తోడివా ర్నగలతోఁ దులఁదూఁగ మోహితనై
నే నేడ్వవలెనంచు నేడ్చి యేడ్చి
వంటకంబును విస్తరంటలో నిడి జాఁగ
నైన యెప్డుఁ గయ్యమ్ము లాడి యాడి
గీ. విభుని ప్రాణాలు విసిగించి వేచి తినుచు
కూళతనమున మించు గయ్యాళియాండ్రు
పోరుపడలేక దయమాలి క్రూరులగుచుఁ
బుత్రికల నమ్ముచున్నారు పురుషు లకట! ౧౮

సీ. తనకు రూకలు వచ్చునను సంబరమెకాని
    తనయ రూకల మాటఁ దలఁపదెపుడుఁ
తనకుఁ గోకలు వచ్చునను సంతసమెకాని
    తనయ కోకల మాటఁ దలఁపదెపుడుఁ
తనకు రైకలువచ్చునను కౌతుకమెకాని
    తనయ రైకల మాటఁ దలఁపదెపుడుఁ
తనకు నూకలు వచ్చునను హెచ్చరికెకాని
    తనయ నూకలఁ మాట దలఁపదెపుడు

ఆ. అకట! ముక్కుపచ్చలారని పసిపాప
సంగడికినిఁ బంపి యమ్మినట్టు
స్వార్థపరత శుల్కమాసించి యమ్మెడు
తల్లి సుతల పాలి భిల్లికాదె? ౧౯

సీ. కలిమి లేముల మాటఁ గలనైన దలఁపరు
    అచ్చంపు శీలంబు నరయఁ బోరు
తెలివి తేటల సంగతిని విచారింపరు
    సద్గుణైశ్వర్యంబు చాయఁబోరు
సంప్రదాయంబు వంశంబుఁ జింతింపరు
    ప్రాయంబు చందంబు రోయఁబోరు
విద్యయు గరిమంబు వివరించి చూడరు
    సోయగంబుఁ బరీక్ష సేయఁబోరు

గీ. జాతి చూడరు నాడుల జాడఁ గవరు
జంపతుల మానసంబు లేచందమునను
గలియు ననుకొందురో గాని కరుణమాని
శుల్కమున కమ్ముచున్నారు సుతల నకట! ౨౦

సీ. పీటపైఁ గూర్చుండఁ బెట్టిన వేళను
    మాతకై పెండ్లికుమారుఁ డేడ్వ
తాళిఁగట్టెడు వేళఁ బాలకై పోట్లాట
    గోలుగోలునఁ బెండ్లికూఁతు రేడ్వ
విభుఁడు సూత్రము ముడివేయలేఁడని పురో
    హితుఁడె కన్యకుఁ దాళి నతుకఁబెట్ట
తలఁబ్రాలు పసిదంపతులు పోయలేకున్న
    వరుసవా రావేడ్కఁ జరగఁజేయ

గీ. పల్లకీనెక్కి యూరేగు పట్టులందె?
యాదమరచి నిద్రించెడు నట్టి చిట్టి
కందులకుఁ బెండ్లి సేయుటకంటె లక్క
బొమ్మలకుఁ జేసి ముచ్చటల్ పొందరాదె? ౨౧

సీ. బువ్వ బువ్వ యటంచు బోరున నేడ్చెడు
    కసుగాయలకు గాయ కసరులిచ్చి
కూనలతో నాఁడుకొనబోదు నని యేడ్చు
    తటిని బొమ్మలను ముందరను వైచి

బాజాలు వాయింప భయపడి యేడ్చు న
ప్పుడు మంచిమాటల బుజ్జగించి
మెడలోన మినుకును ముడివేయునెడ బూచి
యని యేడ్వ మెల్లన నళుకుఁ దీర్చి
గీ. మఱియు నెన్నేని విధముల మాటిమాటి
కేడ్చు బిడ్డలయేడ్పు లెట్టెట్లొ యుడిపి
బలిమిచేఁ దల్లిదండ్రులు సలుపునట్టి
పెండ్లియును బెండ్లియే? పెద్ద పెండ్లిగాక. ౨౨

సీ. మొదట బాలారిష్టములఁ బ్రాణభయము లా
గండంబు లెట్లైనఁ గడచు నేని
సదమల విద్యాలసద్గుణవ్యాప్తికి
సంపూర్ణ విఘ్నంబు సంభవించు
సమకళా గుణవయ స్సౌందర్య మహితులు
కారేని డెందముల్ గలియు టరుదు
డెందముల్ గలియకుండిన రాజకీయముల్
సదనకృత్యంబులు సాగఁబోవు
గీ. జగడములు గల్గు నిరతంబు దంపతులకు
దాన సంసారమున రక్తి తగ్గిపోవు
పొసఁగు లెన్నేని యామీఁద బొసఁగుచుండుఁ
గాన బాల్య వివాహముల్ మానరయ్య! ౨౩

స్త్రీవిద్య మొదలంట క్షీణించుచుంట కీ
కసుగాయ పెండ్లిండ్లె కారణములు
ప్రజలెల్ల మిగుల దుర్బల దేహులగుట కీ
కసుగాయ పెండ్లిండ్లె కారణములు
మానవుల్ ఘోర రుగ్మతలపా లగుట కీ
కసుగాయ పెండ్లిండ్లె కారణములు
కట్నముల్ శుల్కముల్ కడువృద్ధిఁ గనుట కీ
కసుగాయ పెండ్లిండ్లె కారణములు
గీ. వేయిమాటలేల? విధవల సంఖ్యయుఁ
బ్రబలి దేశమునకు భారమైన
కస్తిఁదెచ్చి పెట్టఁ గసుగాయ పెండ్లిండ్లె
కారణములు నాశ కారణములు. ౨౪

సీ. సంసారమనెడు వృక్షమున కీ పెండ్లిండ్లు
వేరు పుర్వులె యంట వింతకాదు
వేరముల్ పొసగించు విద్య కీ పెండ్లిండ్లు
నారదాంశములంట నవ్వుకాదు
కనుచుండఁ గుతుకంబుఁ గొనుట కీ పెండ్లిండ్లు
గజదొంగలంట యక్కజముకాదు
విడువని దుఃఖంబు లిడుట కీ పెండ్లిండ్లు
కడగండ్ల గనులంట కల్లకాదు

గీ. భవనము వనమ్ముగాఁగఁ గన్పడఁగఁ జేసి
యతుల గతుల దంపతులను ననయ మలయఁ
జేయు పల్లె కీ పెండ్లిండ్లు చేటుఁజేయు
గ్రహములనియంట సంశయావహము కాదు. ౨౫

సీ. చెలువు రాణించు రా చిలుకకూనలఁ బెంచి
పెంచి పిల్లికి సమర్పించినట్లు
చెఱకు చే నేపుగా బెఱుగునంతకుఁగాచి
కాచి నక్కలపాలఁ ద్రోచినట్లు
చేతులారఁగ నీళ్ళు చేది పోషణ జేసి
చేసి పూదీఁగెలం గోసినట్లు
జింకపిల్లలం గూర్మి చిలుకఁ జేరఁగఁదీసి
తీసి బెబ్బులి నోట వేసినట్లు

గీ. పదినెలలు మోసి మముఁగాంచి బాల్యమిఱం
బెంచి మామూలమున సేకరించి ధనముం
దుదకుం బ్రేమానుబంధంబుం ద్రుంచి ముసలి
దయ్యముల కప్పగింతురే! తల్లులార! ౨౬

సీ. మిసమిస లాడెడు మిసిమి బంగరుచేల
పిండి బొమ్మకు గట్టిపెట్టినట్టు
నిండునిగారంపు దొండపండును మాల
కాకిముక్కున వ్రేలగట్టినట్టు

నిగనిగమను నింద్రనీల మాణిక్యంబుం
గోని పాదరక్షను గూర్చినట్టు
తలతల మనెడు రత్నంపుదీపము శూన్య
నిలయ మధ్యము నందు నిల్పినట్టు

గీ. దయయు దాక్షిణ్యమును బాప భయము మాలి
శుల్కమున కాసపడి త్రపాశూన్య వృత్తి
లేఁత వయసున నున్న బాలికలఁ బట్టి
ముసలి దయ్యాలపాల్సేత ముప్పుకాదె? ౨౭

సీ. ఘుమఘుమ మను స్వచ్ఛ గోఘృతంబును దెచ్చి
బూడిదలోఁ బారఁబోసినట్లు
మేలైన యాణిముత్యాలపేరును గొమ్మ
దిమ్మరిచేతి కందించునట్లు
రమణీయతర పద్మరాగ మాణిక్యముల్
ముసిడి పండ్లకు వెలఁబోసినట్లు
పెద్దకాలము మేకపిల్లలఁ బోషించి
పెద్దమ్మవారి కర్పించినట్లు

గీ. దయయు దాక్షిణ్యమును బాప భయము మాలి
శుల్కమున కాసపడి త్రపాశూన్య వృత్తి
లేఁత వయసున నున్న బాలికలఁ బట్టి
ముసలి దయ్యాల పాల్సేత ముప్పుగాదె? ౨౮

గమగమ మను మంచి గంధంపు తరులను
గట్టెల కోసమై కొట్టినట్టు
తలలోన నున్న ముత్యాలకై యాశించి
మద కరీంద్రముఁ బట్టి చదిపినట్టు
చేతి కందని పండు జేకొంటకై చెట్టు
గొడ్డంట వ్రేళ్ళతోఁ గూల్చునట్టు
ఎలుకలబాధ మాయింపఁగా నూహించి
యింటికి నగ్గి నంటించినట్టు

గీ. దూరభారంబుఁ జూడక దోసమనక
శుల్కమున కాసపడి తల్లిదండ్రుల వృత్తి
లేఁతవయసున నున్న బాలికలఁ బట్టి
ముసలి దయ్యాల పాల్సేత ముప్పు కాదె? ౨౯

అతి బాల్యమున వివాహంబు సేయుటకంటె
గుత్తుకఁ గత్తిచేఁ గోయరాదె?
కడువృద్ధునకు బల్మిఁ గట్టిపెట్టుటకంటెఁ
బుట్టఁగానె విషంబుఁ బెట్టరాదె?
శుద్ధ మూర్ఖునితోడ జోడుఁ గూర్చుటకంటెఁ
దెంపున గంగలోఁ దింపరాదె?
శుల్కంబుఁ గొని మమ్ముఁ జుల్క చేయుటకంటెఁ
పెద్దమ్మవారి కర్పింపరాదె!

గీ. ప్రాణపదముగఁ బెంచు మేలైన కురులు
కలుకు గలిగిన మంగలి కత్తిపాలు
చేయుకంటెను బ్రాణముల్ తీయరాదె?
దనుజసములార! హా! తల్లిదండ్రులార! 30

సీ. వర దక్షిణల మీఁది వాంఛచే నొక్కండు
పిల్ల చక్కనిదంచుఁ బ్రేమనొకఁడు
గొప్ప సంబంధమన్ కోర్కెచే నొక్కండు
మేనరికం బన్న మేర నొకఁడు
ప్రాఁత చుట్టరిక మన్ ప్రీతిచే నొక్కండు
పెండ్లి కా దిఁక నంచు భీతినొకఁడు
తల్లి దండ్రుల యాజ్ఞ దాఁట లే కొక్కండు
స్వల్పశుల్కంబన్న భ్రాంతి నొకఁడు

గీ. ఇల్లటఁపు టల్లుఁడై యుండ నెంచి యొకఁడు
నత్తవారింటి యాస్తిపై నాస నొకఁడు
ముందు ముప్పెఱుఁగక చిన్ని ముద్దియలను
బెండ్లి యాడుచు నున్నారు పెద్దవారు. 3౧

సీ. ప్రథమ కళత్రంబు పడసిన సంతతిఁ
బోషింప నెవ్వరుఁ బూనరనుచు
తనకున్న ద్రవ్య మంతయును ననుభవించు
వార లెవ్వారును లే రటంచు

పుత్రులు లేకున్నఁ బున్నామ నరకంబు
మానవులకు నెల్ల మూన దనుచు
అర్థాంగి లేకున్న నవసాన దశయందుఁ
దనకు దిక్కెవ్వరు దగుల రనుచు
గీ. పురుషవరుఁ డపత్నీకుఁడై పరఁగనేని
కర్మకాండకు భంగంబు కలుగు ననుచుఁ
దమరు పెండ్లికిఁ దగకున్నఁ దగవు మాలి
పెండ్లిఁగోరుచు నున్నారు పెద్దవారు. ౩౨

సీ. సరి మీఱ మంగళ స్నానంబు సేయుచో
వలి చేత గడగడ వడఁకి వడఁకి
ప్రియ మొప్ప హోమముల్ వ్రేల్చుచోఁ గనరాక
యాజ్యంబు బూడిదెయందు వ్రేల్చి
క్రొత్తవస్త్రముఁ గట్టుకొన నిల్వఁగాలేక
యచ్చటి వారి సాయఁబు వేఁడి
అగ్ని ప్రదక్షిణం బాచరించుచు నోడల్
దిరిగి పీతాక్షులై ధరణి వ్రాలి
గీ. పాటవము పీటపై నిల్చుపాటిలేక
చిట్టి బొట్టెల సిగ్గరి చెట్టఁబట్టు
పెద్దవారికి వేలాము వెఱ్ఱిగాక
యేమిసంతోస? మిల్లాలి కేమిసుఖము? 33

సీ. అసురు సన్నిధి నరుం డనుభవించు సుఖంబు
సింగంబు దరి కరి చెందు సుఖము
పోరు బెబ్బులి చెంత గంగగోవు సుఖంబు
పాము గీమునఁ గప్ప పడయు సుఖము
చీలి చెంగటి చిన్ని చిలుక కబ్బు సుఖంబు
భిల్లుపొంతను నెమ్మి పిల్ల సుఖము
కాకి కట్టెదుటి పికంబు కాంచు సుఖంబు
గరుడు ముంగిటి నాగ కాంత సుఖము
గీ. చెనటి తోడేలు నెడ మేక గనెడు సుఖము
డేగ దెస పావురంబు పొందెడు సుఖంబు
బకము ముందరి మీనశాబకము సుఖము
తగని మగనింట మగువకు దాపరించు. ౩౪

సీ. చిన్నారి నారినై చెన్నారెదునుగాక
రహిఁ గుల్క నేర్చునే రమణుఁ బాసి
బిత్తరి చిత్తరై పెంపుఁ బెంపునుగాక
రహిఁ గుల్క నేర్చునే రమణుఁ బాసి
చిత్రాల సీమనై చెలఁగుచుండునుగాక
రహిఁ గుల్క నేర్చునే రమణుఁ బాసి
చదురుల కుదురైన చదుగాలగునుగాక
రహిఁ గుల్క నేర్చునే రమణుఁ బాసి

తే. శీలశాలినినై ప్రకాశించుఁగాక
నీతి విస్ఫీతమై సంచరించుఁగాక
సతుల తలమానికంబుగా బ్రతుకుఁగాక
రహిఁ గులుక నేర్చునే ప్రాణరమణుఁ బాసి. ౩౧

సీ. పేద వాఁడ నటంచుఁ బెద్దకూఁతును వైశ్య
రోగి కిచ్చెను వేయి రూప్యములకు
ఋణముఁ దీర్తునటంచు రెండవ సుత నిచ్చెఁ
బేడివానికి వేయి మాడలకును
యజ్ఞంబుఁ జేసెదనంచు మూఁడవ బిడ్డ
వేయి వరాలకు నొక్క వెట్టికిచ్చె
కఠినాత్ముఁడై నూఱు కాసులకును మూఁడు
గాళ్ళ ముసలికిచ్చె గడకుఁ నన్ను

గీ. రత్నములవంటి బిడ్డల ఱాళ్ళపాలు
చేసియును దాను జేసిన దోసముననో?
బాగుపడలేదు మాతండ్రి బాగుపడునె!
కన్న బిడ్డలనమ్మ రాక్షస ఖలుండు. ౩౨

సీ. బొమ్మల పెండ్లిండ్ల పోల్కి బాలల పెండ్లి
యింపుఁగొల్పు నటంచు నెంచియెంచి
మనుమరాలి వివాహమును జూచి హర్షింతు
తాత యవ్వ యటంచుఁ దలఁచి తలఁచి

సుత పుష్పవతి యైనచోఁ బ్రాహ్మణత్వమే
పోవునం చెద భీతిఁ బొంది పొంది
శుల్కంబుఁ గొని యొక్కచో వద్ది కిడిన డ
బ్బబ్బడి యగు నంచు నుబ్బి యుబ్బి

గీ. వరుఁడు లేనట్టి యొక ముది వరడునకును
నేఁ డెనిమిది నిండక మున్నె పెండ్లి చేసి
కొలఁది నాళ్ళకె నన్నొక కుంకఁ జేసి
దనుజ సములైరి నా తల్లి దండ్రు లకట! ౩౩

సీ. పాలు నీళ్ళను బోలెఁ బాయక తగు సతీ
పతుల నొండొరులను బాపినావొ?
తావియుం బూవు చందమున సైక్యముగన్న
దంపతులకుఁ బగల్ దాపినావొ?
చిలుకయుం గోరువంక వలె మైత్రిఁ గల వధూ
వరుల కారాటంబు నెరపినావొ?
ఆత్మయు దేహంబు నందంబు నెనయించు
గువ్వ జంటల కెడల్ గొలిపినావొ?

గీ. తత్ప్రతిఫలంబు నున్నది తప్ప దనుచు
ప్రాప్త ఫలమంచు నోదార్పఁ జూతు రిపుడు
తాము చేసిన కార్యంబుఁ దలఁప బోక
తగవు మాలిన నా తల్లిదండ్రు లకట! ౩౪

సీ. కలికి పల్కుల రామచిలుక జంటను బాపి
పంజరంబుల బాధ పఱచినావా?
కవ గూడి పొల్చు జక్కవ జత నెడఁ బాపి
పటుతరం బగు బాధ పఱచినావా?
ప్రియముమై విహరించు పిక యుగంబును బాపి
పాపం బనక బాధ పఱచినావా?
మధు పాని క్రీడించు మధుపద్వయముఁ బాపి
పదటునఁ గడు బాధ పఱచినావా?
గీ. తమినిఁ గవగూడు కలరవ దంపతులను
బాపి దయమాలి బలుబాధ పరచినావా?
తత్ఫలం బిది కుడువక తప్ప దనుచుఁ
దల్లి దండ్రులె యిప్పు డోదార్తు రకట! ౩౯
సీ. భర్తను గోల్పోయి పలవించు కామినిఁ
జెలఁగి నవ్వుచు గేలి చేసినావా?
నాథునిఁ బాసి ఖిన్నత నొందు కాంతను
గాంచి మేలంబుఁ గావించినావా?
పతి విడ నాడిన పద్మాక్షి నీక్షించి
కూడని యెకసక్కె మాడినావా?
ప్రాణనాథుని పొందుఁ బడయ నేరక కుందు
నబలను హేళన మాడినావా?

గీ. ఇంక నెవ్వరిఁ జూచి గర్వించినావొ?
ప్రాగ్భవంబునఁ దద్ఘోర పాప మిట్లు
ప్రాణనాయకు పొందెడ బాపె ననుచుఁ
దల్లి దండ్రులె యిప్పు డోదార్తు రకట! ౪౦
సీ. ధనముకై యాశించి యనురాగ లతఁ ద్రుంచి
తనయ నమ్మిన తల్లి దండ్రులార!
ఇరు వైపులను లంచ మిరవుగాఁ గొని వధూ
వరులఁ గూర్చిన రాయబారులార!
పప్పు భోజనములపైఁ బ్రీతిఁ గైతవ
ప్రియము లాడిన పెండ్లి పెద్దలార!
బహుమతులై యుండి బహుమతుల్గోరి మృ
షోక్తుల్ వచించిన జోస్యులార!
గీ. అసుర సములార! నిర్దయా స్వాంతులార!
శఠ హృదయులార! నాపాలి శత్రులార
కారణం బీ వెడందకు మీరె కారె?
చలము తీరెనె? మీ కనుల్ చల్ల వడెనె? ౪౧
సీ. సోముఁ గేరెడు లేత మోమునఁ గస్తూరి
రేఖ పోయి విభూతి రేఖ వచ్చె
తళతళ లీను నిద్దంపు గాజులు పోయి
కేల మోటైన పట్టీలు వచ్చె

మృదువైన వన్నె చీరెలు పోయి నెమ్మేన
ముదుకనూల్ సైను దోవదులువచ్చె
గళమున భూషణావళి పోయి తులసి మా
లికలు రుద్రాక్ష మాలికలు వచ్చె
ఆ. కలికి క్రాలుఁ గన్నుఁ గవను నీలంపుఁ గ
జ్జలము పోయి యశ్రు జలము వచ్చె
బాధ లెన్నఁ దరమె? బాల్య వైధవ్యంబు
దుస్సహంబు మిగుల దుస్సహంబు! ౪౨

ముప్పొద్దుఁ గడు పార భుజియించు టది మాని
యేక భుక్తమున గ్రహింప వలసె
అనుపమ భోగంబు లనుభవించుట మాని
భోగులఁ బొడఁ గాంచి పొగల వలసె
శుభ శోభనంబులు చూడఁ బోవుట మాని
తీర్థ యాత్రల కంచుఁ దిరుగ వలసె
మృదు పుష్ప శయ్యల మేను జేర్చుట మాని
బండ నేలల యందె పండ వలసె
గీ. చందనాది సుగంధ చర్చలను మాని
కాయమున బూది పూఁతలు పూయ వలసె
నిట్టి కష్టంబు లెట్లు సహింతు సకియ!
బాల్య వైధవ్య మతి దుఃఖ భాజనంబు! ౪౨

రంగు చీరెల ననురాగంబు పోలేదు
మల్లుచీరెల రక్తి మాయలేదు
పూల చీరెలపైని మురువు తీఱగ లేదు
సన్న చీరెల మోజు జాఱ లేదు
జలతారు చీరెల వలపు చెల్లఁగలేదు
మళ్ళచీరెలఁ గోర్కె మళ్ళలేదు
పట్టు చీరెల యందు భ్రమ మానఁగా లేదు
తోపు చీరెలఁ బ్రేమ తొలఁగ లేదు
ఆ. రకరకంబులైన రైకల మీఁదను
మనసు దీర లేదు తనదు సాటి
చెలులు ముద్దునసుల చీరెలఁ గట్టంగ
సైను గట్టి నేను సైపఁ గలనె? ౪౩
సీ. బండ నేలను నేను బడి యుండఁ బరుపు పై
బండ మీ మనసు లే భంగి నొప్పె
చన్నీళ్ళ నేను మజ్జన మాడ వేన్నీళ్ళ
స్నాన మెట్లోర్చె మీ మానసంబు
నిశ యెల్ల వగలచే నేఁ గృశింపఁగను నే
కరణి వచ్చెను మీకు గాఢ నిద్ర
కాయ్య రొట్టెలు మెక్కి గోడు నేఁ జెందంగ
మృష్టాన్న మెట్లు మీ కిష్ట మయ్యె?

గీ. చిన్న వయసున నుండి మీ జీవములకు
నుస్సురని యేడ్చు ననుఁ జూచు చుండి యకట!
వృద్ధులై యెట్లు సుఖియింప నిచ్చ గలిగె?
దనుజ సములార! యో తల్లిదండ్రులార! ౪౪

సీ. మల్లి పుష్పములఁ జామంతి పువ్వుల జాజి
విరులను గనుఁగొన్న తరుణమందు
బచ్చ కర్పూరంబుఁ బండు వెన్నెల మంచి
గందంబుఁ గాంచిన క్షణము నందు
శృంగార వనముల బంగారు నగలను
మేలి చీరెలఁ గన్న వేళయందు
సొగసు శయ్యల జగా వగ గుల్కు చిత్రముల్
జోలికల్ వీక్షించు కాల మందు
గీ. మించు టద్దంబులను దిలకించు నపుడు
బండు టాకులు కన్పట్టు పట్టునందుఁ
బ్రాణనాథునిఁ బాసిన పడతి మనసు
శోక సాగర మగ్నంబు గాక యున్నె? ౪౫

సీ. పెండ్లి వారిండ్లకుఁ బేరంటమున కేగు
మించు బోణులను వీక్షించు నపుడు
విభులకుఁ గపురంపు విడియంబు లందించు
చంచలాక్షుల నిరీక్షించు నపుడుఁ

గురుల చిక్కఁడలించి విరుల మొత్తులఁ దాల్చు
కాంచనాంగుల దిలకించు నపుడు
సరస సల్లాపముల్ వరుసతో గావించు
నంచయానల విలోకించు నపుడుఁ
గీ. జిత్తమెరియ నసహ్యంబుఁ జెంది కుంది
విరహ పరితాపమునఁ బుర పురను బొక్కి
సొక్కి తమిఁ జిక్కి తాలిమి దక్కి సుక్కి
పొందు నా వెత నే మనుకొందు నకట! ౪౬

సీ. కడుఁ జక్కదనముచేఁ గంటి కింపై నట్టి
పడుచు వారలు కంటఁ బడిన యపుడు
రంగారు శృంగార రసకవిత్వముఁ జెప్ప
రసిక శేఖరులు తారసిలి నపుడు
మధుర భాషలు మేల్ చమత్కారములు గల్గు
జాణలతో గోష్ఠి జరుపు నపుడు
వీనుల విందుగా గానంబు నెరపెడు
ననుపుకాండ్రను గనుంగొనిన యపుడు
తే. పటు బలిష్ఠాంగు లెదుటఁ గన్పట్టునపుడు
కుదురు పాటింతయును లేక చెదరు హృదయ
మెట్టి సంకల్ప మెప్పుడు పుట్టఁ గలదొ?
కటకటా! దైవమా! నీవె కావ రావె! ౪౭

సీ. సెజ్జపై నుండి లేచిన వేళఁ గన్పడు
నో యంచు నోరల నోదుగుచుందు
పొగుగూరు పైనమై పోవుచో నెదు రేగు
దెంచునోయని సంశయించు చుందు
శుభకార్యములఁ దాము చూడఁ బోయెడు పట్ల
వెంట నేగఁగ జూచి విసుగు గొందు
కూడు గుడ్డయు మాలి కొంపఁ జేరె నటంచుఁ
గోపించి పలుమాఱు గొణుగు కొందు
ఆ. వచన మెంత శుచియు రుచిఁ గల్గఁ జేసిన
నేమొ వంక లెంచి యీసడింతు
దయను మాలి తల్లిదండ్రులే పుట్టింట
బాల విధవ బ్రతుకు బ్రతుకు బ్రతుకె? ౪౯

సీ. పతి పాద పద్మముల్ భక్తితోఁ బూజించి
పుడమిపై ధన్యతఁ బొందు టెట్లు?
ముద్దు ముచ్చట దీఱ ముత్తైదువులఁ గూడి
పేరంటమున కింక వెళ్ళు టెట్లు?
బిడ్డలఁ గని పెంచి ప్రేమతో ముద్దాడి
లోచ నోత్సవముగాఁ జూచు టెట్లు?
నా నెచ్చెలి యితండు నా మనోహరుఁ డంచు
చెలులకుఁ జూపించి చెప్పు టెట్లు?

గీ. చుట్టముల యిండ్లలో శుభ శోభనములు
జెలుగు వేళల సరి వారిఁ గలసి మెలసి
పోవు టింకెట్లు? నే నట్టి పుణ్యహీను
రాల నైతినె! యకట! యింకేల బ్రతుకు? ౫౦

సీ. తన మనోహరు నింగిత మెఱింగి వర్తిల్లు
మెలఁతలకే యింతి మేలుబంతి
తన యత్తమామలందున భక్తి పచరించు
చర్యకే బోటి వజ్రాలపేటి
తన బావల మఱందులను మన్ననలు చేయు
పనులకే కొమ్మ బల్ పట్టుఁ గొమ్మ
తన యాఁడుబిడ్డలఁ దనిపి వాసికి నెక్కు
ముదితలకే మించుబోణి రాణి
గీ. చుట్టపక్కాల సురభియై పుట్టినిల్లు
మెట్టి నిలు వన్నె వెట్టె నీ మేటి బోట్టె
యనఁగ మెచ్చంది కాపురం బాచరింప
నోచనైతిసి నిర్భాగ్య నీచనైతి. ౫౧

సీ. చుట్టాల యిండ్లలో శుభశోభనము లంచు
నీడుగా జోడుగా నేగు సిరియు
దాంపత్య తాంబూల తరుణంబు లంచు బల్
హాయిగా మురువుగా నరుగు సిరియు

తిరునాళ్ళ దేవుళ్ళ దరిసెనంబు లటంచు
నలువుగాఁ జెలువుగా నడుచు సిరియు
సరిగంగ స్నానాల సమయాలటంచు మేల్
పొలుపుగా బులుపుగాఁ బోవు సిరియు
గీ. బారసా లంచు మరి కన్యధారలంచు
మించు వేడ్కను బీటల మీఁద జేరి
యింపుగా సొంపుగాను బెంపెసఁగు సిరియు
గగన కుసుమంబె నా మనుగడకు నకట! ౫౨

సీ. భోగి నాఁడతి మోదమునఁ దలంటుకొని గో
రంటాకు నిడుకొను నట్టి వేడ్క
మవ్వఁబుగాఁ జద్ది బువ్వంబు వేగు జా
మున లేచి ప్రీతితోఁ దినెడు వేడ్క
చెలువారు పండు వెన్నెల బైట జతకత్తె
లను గూడుకొని యాటలాడు వేడ్క
ప్రొద్దు పొద్దుననె నోమును నోచి వాయనా
లెలమి నైదువల కందించు వేడ్క
గీ. బెడఁగు జడవైచి పువ్వులు ముడిచి జిలుగు
చలువ వలువలు దాల్చి సంజలను వెడలి
హొయలు మీరంగ నుయ్యాల లూఁగు వేడ్క
యట్లు తగ్గిల నీక నెట్టు లనుభవింతు. ౫౩

సీ. పెండ్లికి ముందుగాఁ బెద్దలు నాచేతఁ
గావింపఁ జేసిన గౌరిపూజ
పెండ్లికాలమునందు వేదమంత్రాలతోఁ
జేసిన ద్విజుల యాశీర్వచనము
మినుకును గుత్తికంటును స్పృశించిన పుణ్య
సాధ్వీమణులచేతి చల్లఁదనము
పరిపూర్ణ సౌభాగ్య భాగ్యంబు జాతకం
బుల వ్రాసినట్టి జ్యోతిష్యుల వచస్సు
గీ. మోద మిగురొత్త మాయమ్మ మొక్కఁజేయ
మించు ప్రేమను నన్ను దీవించినట్టి
పెద్దలయుఁ బేరటాండ్రయుఁ బెంపులెల్ల
నాయభాగ్యాన వ్యర్థమై పోయె నకట! ౫౪

సకల విద్యలయందు శారద యన మించి
యెవరి మానసము మెప్పించుదాన
సదన కృత్యముల వైశద్యంబుఁ జూపించి
యెవ్వరి మనసు రంజించు దాన
చాతుర్య చర్యలఁ జాకచక్యముఁ జూపి
యెవ్వరి మదిఁ గరఁగించు దాన
సరస శృంగార వైఖరులెల్ల వెలయించి
యెవరి చిత్తంబుఁ జొక్కించుదాన

గీ. కైతల రచించి సంగీత కలన మెరసి
యెవరి సొగియించుదాన హా! యెల్లఁ జెడియె
నెవరి నలరింప నీ నేర్పు లెల్ల నేర్చి
నానో? యా యేలిక జగానఁ గానఁ గాన. ౫౫

సీ. మందహాసమ! రాకుమా! యింక నావంక
నాకును నీకు ఋణంబు చెల్లె
ఉత్సాహమా! క్రొత్తయునికిని జూచుకో!
యణఁగి యుండఁగ లేవు క్షణికమైన
సంతోసమా! మన సంబంధములు తీరె!
నీ మేనితోడ నిన్నెనయలేను
ఆనందమా! పోతివమ్మ! హా! ననుబాసి
రావుగా! జన్మాంత రంబుదాక

గీ సౌఖ్యమా! నీవు నేనును శత్రువులము
పొమ్ము! పోపొమ్ము! మనకింక పొత్తు లేదు!
భోగవై భోగముల కెల్ల మూలమైన
జీవితేశుండె నన్నొంటిఁ జేసెఁ గాన. ౫౬

సీ. కన్న బిడ్డలఁ గూర్చి కరుణ నక్కునఁ జేర్చి
చెక్కులు ముద్దాడి సొక్కు సొగసు
నుయ్యాల లం దుంచి యొయ్యారముగ నూచి
జోల పాటలు పాడి సోలు సొబగు

సంజ చాయను జూపి చందమామను జూపి
లాలించి పోర్మాన్పు మేలి హాయలు
గోర్వంక యనిపించి కూనలఁ గనిపించి
ప్రియముమై బువ్వఁ దిన్పించుహావుసు

గీ. లలిత భూషలు వలువ లలంకరించి
యిరుగు పొరుగుల పిల్లల నెనసి మొనసి
యాట లాడంగఁ బాడఁ గాంచి యలరు సొంపుఁ
బడయ నోచని తనువు పాపముల మనువు. ౫౭

సీ. ఎల నవ్వు నవ్వుచు నెలమి మైఁ గేలెత్తు
కొమ్మని యెత్తుచోఁ గ్రొత్తనలువు
లీలతోఁ దన యంత లేచి సారెకు నేల
నిద్దెముల్ సేయుచో ముద్దు చెలువు
లలి మీఱ నల్ల నల్లనఁ దప్పటడుగులు
వేయు నప్పుడు తోఁచు వింత మురువు
తొక్కు పలుకులు తేనె తొలుకంగఁ బలుకుచోఁ
గనుపట్టు నట్టి యక్కజఁపు హరువు

గీ. కన్న బిడ్డలకడఁ దన గన్నుఁ దోయి
కఱవు దీఱఁగ మగనితోఁ గాంచలేని
పతిత యగు నన్ను వంటి నిర్భాగ్య బాల
విధవ జన్మంబు పృథివిపై వృథయె గాదె? ౫౮

సీ. తల్లియే దాయఁగాఁ దలపోయు చుండంగఁ
దండ్రియే నిర్దయత్వంబు దాల్ప
నన్నలే పలుమాఱు లాగ్రహించుచు నుండఁ
దమ్ములే యలఁతిగాఁ దలచుచుండ
వదినెలే చలపట్టి యదలించు చుండఁగా
మఱదండ్రి మర్యాద మాని యుండ
జెలియండ్రు మన్నన సేయ కేమరి యుండ
నక్కలే పరుషంబు లాడుచుండ
గీ. నన్నిటికి సైచి పగలు రే లనక యోర్మిఁ
గూర్మి కనుపట్టఁ బుట్టింటఁ గూటి కొఱకు
గుడ్డ కొఱకును బానిస కూతులట్లు
బాల విధవలు పడు పాట్లు బ్రహ్మ కెఱుక! ౫౯

సీ. చిత్తేశ్వరుని రూపుఁ జిత్రంబునను వ్రాసి
మెప్పించి పొందెడు మేటి సుఖము
ప్రాణేశ్వరుని మీఁదఁ బద పద్యములుఁ గూర్చి
యలరించి పొందెడు నమిత సుఖము
కాంతుని కడ నర్మ గర్భ సూక్తులు పల్కి
కరఁగించి పొందెడు పరమ సుఖము
చెలువుని చెంత సంచిత విలాసము చూపి
వలపించి పొందెడు వర సుఖమ్ము

ఆ. విభుని సరస మిగుల విన్నాణముల నొప్ప
కుట్టు పనులఁ బూస గ్రుచ్చు పనుల
నైపుణముల నెల్లఁ జూపి చొక్కించుచు
పొందు సుఖ మదెంత పుణ్యవతికొ? ౬౦

సీ. ఆఁడు జన్మం బెత్తి గోడుఁ జెందుట కంటె
నగమొ పాషాణమో యగుట మేలు
పుడమి వేల్పుల యింటఁ బుట్టు వొందుట కంటె
నడవిలోఁ బెద్ద మ్రానగుట మేలు
ముసలి పిశాచికి ముగుద యగుట కంటెఁ
బ్రహ్మచర్యము తోడి బ్రతుకు మేలు
బాల వితంతువై వగచు చుండుట కంటె
యోగినినై కాన నుంట మేలు
గీ. పొట్టకును బట్టకును జేరి పుట్టి నింట
బానిసల రీతి రేలును బగలు ననక
పనులు సేయుచుఁ బలుపాట్లు పడుట కంటెఁ
దటుకున విషంబుఁ ద్రావి చచ్చుటయె మేలు! ౬౧

సీ. అత్యంత దారిద్ర్య మనుభవింపఁగ వచ్చు
బాల వితంతువై బ్రతుక రాదు
బలు రోగములచేత బాధ లందఁగ వచ్చు
బాల వితంతువై బ్రతుక రాదు

పరమ కురూపిణియై భరియింపఁగా వచ్చు
బాల వితంతువై బ్రతుక రాదు
సేవా ప్రవృత్తిచే జీవింపఁగా వచ్చు
బాల వితంతువై బ్రతుక రాదు

ఆ. పాపజాతి యగుచు బ్రతుకంగ వచ్చును
బాల విధవ యగుచు బ్రతుక రాదు
మతి విహీన యగుచు బ్రతుకంగ వచ్చును
బాల విధవ యగుచు బ్రతుక రాదు. ౬౨

సీ. కాలి యందియలును గడియాలుఁ దీయంగఁ
దలఁచు చో నెమ్మోము జలదరిల్లి
నిగనిగ ల్మెఁచు బల్ నిడుద పెన్నెఱి గుంపు
ఖండింప నెంచుచోఁ గంప మొంది
కాంతుల నీను చొక్కంపుఁ జే గాజులు
పొడిసేయఁ బూనుచో నొడలు మఱచి
గళమున వ్రేలు చక్కని పుస్తెఁ బుటుకువఁ
ద్రెంపం గడంగు చో స్పృహను దప్పి

గీ. సన్న పుట్టంబు నెడలించి పైని బట్ట
గట్టఁ జేయుచోఁ బ్రాణంబు కడను బట్టి
కాంత లుండంగ దయమాలి కన్నవారె
వికృత రూపిణిఁ గాఁగఁ గావింతు రకట! ౬౩

సీ. సన్న కుంకుమ రేక సున్నయైన మొగంబు
పవలింట చంద్రబింబంబు గాదె?
ఒనపరి నగ లెల్ల నూడ్చిన నెమ్మేను
పూవులు గోసిన తీవ గాదె?
నూనె రాయక యున్కి నునుపు దక్కిన నెఱుల్
చమరీ మృగంబు వాలంబు గాదె?
జాలు వారెడు నశ్రుజలముఁ గల్గిన కనుల్
మంచునఁ దోఁగు తామరలు గావె?

గీ. గద్గదిక దోఁపఁ గాఁ బల్కు కల్కి పల్కు
వికృత వాసంతి కేతర పికము గాదె?
మోదమును దక్కి భూ భోగములను రోయు
బాల విధవయె జీవచ్ఛవంబు గాదె? ౬౪

సీ నిత్య శృంగారంబు నిష్ఫలం బై పోయె
నుదయ కుంకుమమును బదటఁ గలసె
కాటుక గారి బల్కానల పాలాయె
కన్య తులసి కొఱగాక పోయె
మోచేతి పద్మంబు మొదల వ్యర్థం బాయె
ల్లి చుక్కయు మేలు సలుప దాయె
వర లక్ష్మియైన నాపదఁ బాప రాదాయె
చిట్టి బొట్టు వ్రతంబు చెట్లఁ బట్టె

ఆ. తద్దె నోములైనఁ దప్పింప లేవాయె
భారమైన యీ విపత్తు నుండి
నోము లెందునైన బాములఁ బాపునే?
బాల నగుట జేల పడితిఁ గాక! ౬౫

సీ. దయ లేని వారలఁ దలి దండ్రులుగఁ జేయ
దైవమా! నాయందుఁ దప్పు గలదె?
కడు బీద బాపల కడుపునఁ బుట్టింప
దైవమా! నాయందుఁ దప్పు గలదె?
ముసలి యన్ మొసలికి ముదితను గాఁ జేయ
దైవమా! నాయందుఁ దప్పు గలదె?
పసి తనంబుననె నా పతినిఁ జంపుక పోవ
దైవమా! నాయందుఁ దప్పు గలదె?
గీ. జోడు వీడక నాయీడు జోడు చెలులు
వేడుకల వెల్లిలో నోల లాడుచుండ
జోడు గూర్పక నన్ను విజ్జోడు జేయ
దైవమా! దీన నాయందుఁ దప్పు గలదె! ౬౬

సీ. కొమ్మలతోఁ గూడి బొమ్మల పెండ్లిండ్లు
చిత్తంబు రంజిల్లఁ జేయ లేదు
వండి గుజ్జన గూళ్ళు వరుస బంతులు తీర్చి
మించుబోణులకు వడ్డించ లేదు

వియ్యంపురాండ్రతో నెయ్యంబు రెట్టింపఁ
దూఁగు టుయ్యాలలం దూగ లేదు
పసపుఁ గుంకుమయును బదిమంది చెలులకు
వేడుకతోఁ బంచి పెట్టలేదు
గీ. వక్క లాకులుఁ జేఁ బూని యొక్క నాడుఁ
జక్కఁగా వీడియంబును జలుప లేదు
కటకటా! దయ్యమా! యింత కరుణ లేక
కుతుక మంతయు నిప్పుడే కూల్పఁ దగునె? ౬౭

సీ. అచ్చనగాయ లప్పచ్చులు నల్లొనే
రేములఁ జెలులతో నాడ లేదు
ఆలంకిగుడి యంజి యీలకూఁతలు నీడు
జోడు చేడెలతోడ నాడ లేదు
కను మూసి గంత నల్ గంబాల యాటలు
వేడుకతోఁ గూడి యాడ లేద
ఒప్పుల కుప్పలు నోమనఁ గుంటలుఁ
దోడి బాలికలతో నాడ లేదు
గీ. గోడి పట్టెలు గొబ్బిళ్ళు నాడలేదు
తక్కుఁ గల్గిన క్రీడలఁ దనివి దీఱ
నాడ లే దాయె నామేలు చూడలేక
మాల దయ్యమ? నన్నిట్లు మూలఁ ద్రోతె! ౬౮

సీ. పండుగనాడైన నిండు వేడుకతోడ
బట్టుపుట్టంబులఁ గట్టలేదు
మవ్వంబుగాఁ గురుల్ దువ్వి బల్ హొయలుగా
జడవైచి పువ్వులు ముడువలేదు
ఇరుగు పొరుగువారి వెరవు తెచ్చుకయైనఁ
దగు నగల్ మైనిండఁ దాల్పలేదు
తోయంబువారలతోఁ గూడి పేరంట
మునకైనఁ బలుమాఱు చనఁగలేదు
గీ. కోర్కె లేవియుఁ దీఱని కూన నాకు
హెచ్చు వైధవ్య దుఃఖంబుఁ దెచ్చిపెట్టి
వెతలఁ గుములుచు నీరీతి బ్రతుకు మనుట
ధర్మరక్షక! నీకిది ధర్మమయ్య! ౧౯

సీ. అత్తవారింటనే యణఁగి యుండుద మన్న
నాగోడుఁ జూచ రనాథ నగుట
కన్నవారలయింటికడ కేగుద మటన్న
లెస్సగా వారికే లేదు తిండి
బంధువు లిండ్లలోఁ బడియుంద మని యన్న
'నా' యన్నవారు కానంగరారు
నగలు మార్చుక జీవనంబు సేయుదమన్న
శుల్కవిక్రీత కేసొమ్ములుండు?

గీ. ఇఁక నెందుల కేగుదు? నెవరు దిక్కు?
జీవయాత్రకు నాకెద్ది త్రోవ? యకట!
బ్రతుకఁజాలను నను గూడ భర్తకడకు
దయను గొని పోవఁగదవయ్య! ధర్మమూర్తి! ౨౦

సీ. అమ్మరో! మీపుణ్య మయ్య! మీదయ యంచుఁ
బెఱవారిఁ జాలసేవింపఁజాల
చేఁ జాచి చెంగుఁజాచియును దేహి యటంచుఁ
దీనతఁ జాలఁ బ్రార్థింపఁ జాలఁ
"అనద ననాథ నన్నాదరింపరె"! యంచుఁ
గృప పుట్ట జాలఁ గు య్యిడఁగఁజాల
"గతి లే"ద టంచు నిగ్గతి" "మీరె గతి!" యంచు
వెతలెల్లఁ జాల విన్పింపఁ జాల
గీ. పరుల కొంపలలోఁ జేరి పనులు సేసి
దాసివలె హేయముగఁ బొట్ట వోసికొనుచు
బ్రతుకఁజాలను గతిలేని పతిత నన్ను
దెంపుననుఁ జంపుకొనిపోవె! దేవదేవ! ౨౧

సీ. ఫలమును రుచియును గలసి యుండెడు రీతి
విభుఁడు నేనును గూడు వేడుకయును
సుమము మరందంబు నమరి యుండెడు భాతి
వరుఁడు నేనును గూడు వైభవమును

వాక్కును సర్థంబు వఱలు చుండెడు భంగిఁ
బతియు నేనును గూడు పండువయును
చంద్రుఁడుఁ జంద్రిక జాను మీఱెడు మాడ్కి
సఖుఁడు నేనును గూడు సంతసమును
గీ. మాలదైవము! యీజన్మ మధ్యమందు
నాకు లేకుండఁ జేసి యన్యాయముగను
బాధఁ బెట్టెద వేమి లాభంబు నీకు?
నబల ననిమైన జాలి లేదాయె నకట! ౭౨

రమణుంకు దేశాంతరమునుండి యంపిన
క్షేమలేఖను జూచి చెందు ముదము
మగఁడు విదేశసీమల కేగుదెంచి వ
చ్చిన వేళ వీక్షించి చెందుముదము
ధవుఁ డన్యపుర నికేతనుఁడైనచోఁ దన
సేమంబువ్రాయుచోఁ జెందుముదము
నాథుండు పరపట్టణమునుండి సొమ్ములు
చీరలు నంపుచోఁ జెందు ముదము
గీ. పొందఁ జాలని నావంటి మందభాగ్య
రాలి జీవన మెన్ని చందాలనైన
వృధయె? కావున నన్ను నా విభునికడకుఁ
దెగువఁ గొనిపోవఁ గదవయ్య! దేవదేవ! ౭౩

కపురంపు విడెంబుఁ గాంతున కిచ్చుచో
హస్తసంస్పర్శచే నమరు సుఖము
నెలమి మనోహరుం డేకాంతమాడుచో
నాస్యసంస్పర్శచే నమరు సుఖముఁ
బవళించుతఱిఁ బదాబ్జాతముల్ లొత్తుచో
నంఘ్రిసంస్పర్శచే నమరు సుఖముఁ
జంకబిడ్డను బ్రాణసఖున కందించుచో
సంగసంస్పర్శచే నమరు సుఖము
గీ. నొందఁ జాలని నావంటి మందభాగ్య
రాలి జీవన మెన్ని చందాలనైన
వృధయె కావున నన్ను నా విభునికడకు
దయను గొనిపోవఁ గదవయ్య! ధర్మమూర్తి! ౭౪

సీ. హస్తాబ్జమునఁ జెక్కుటద్దంబు గీలించి
బ్రతుకు నేగర్భనిర్భాగ్యరాలు?
అంగుళీకంబు నాసాగ్రంబునను జేర్చి
బ్రతుకు నేఘోరపాపాత్మురాలు?
ఈక్షణంబును భూతలైక లక్ష్యముఁ జేసి
బ్రతుకు నేపరమదుర్మార్గురాలు?
విమనస్కయై లోక విభవంబులను రోసి
బ్రతుకు నేదురదృష్టవంతురాలు?

గీ. అట్టి బాలవితంతువు నవనియందు
లేక యుండంగఁ జేసిన లోకమునకు
లోటు రాబోదు సత్కృప లోఁదలంచి
ధవునితోఁ గూర్పవే! నన్ను ధర్మమూర్తి! ౭౫

సీ. కంటికి నేల కొక్కటె ధారగా నశ్రు
జలము లోడ్చెడు పాపజాతి యెవతె?
మోకాలిమీఁద మోమునుదీయక వియోగ
సంతప్తయగు పాపజాతియెవతె?
సారెకు వేఁడి నిట్టూరుపుల్ నిగుడించి
ఘాత లెంచెడు పాపజాతి యెవతె?
నేల రాయుచుఁ గాలివ్రేలితో బ్రతుకుపై
రోఁత నొందెడు పాపజాతి యెవతె?
గీ. అట్టి బాలవితంతువు నవనియందు
లేక యుండంగఁ జేసిన లోకమునకు
లోటు రాఁబోదు సత్కృప లోఁదలంచి
ధవునితోఁ గూర్పవే! నన్ను ధర్మమూర్తి! ౭౬

సీ. ప్రాణిహింసయె మహాపాతకం బంచును
బోధించి మాన్పిన బుద్ధమూర్తి!
అబలల దుఃఖంబు లణఁపఁజూచిన దయా
శాలి శ్రీయక్బరు చక్రవర్తి!

సహగమనంబు దుష్టాచారమని మాన్పి
నట్టి శ్రీరామ మోహన సుకీర్తి!
విధవా వివాహంపువిధిఁ దెల్పినట్టి వి
ద్యాసాగరేంద్ర! ధర్మానువర్తి!
గీ. దైవసములార! యో మృతజీవులార!
భవ్యమూర్తులార! మహానుభావులార!
స్వస్థులైతిరె! యకట! మాపాపమునను
మీరచేయున్న మా వెతల్ దీఱకున్నె? ౭౭

సీ. ఫలమేమి? సుజ్ఞాన కలికల సృజియించి
సౌభాగ్యమును వ్రాయఁ జాలవేని
రహియేమి? సౌందర్య లహరుల సృజియించి
సౌభాగ్యమును వ్రాయఁ జాలవేని
పసయేమి? సుప్రభా భాసల సృజియించి
సౌభాగ్యమును వ్రాయఁ జాలవేని
రసమేమి? శృంగార రాసుల సృజియించి
సౌభాగ్యమును వ్రాయఁ జాలవేని
గీ. ప్రతిభ గలవాఁడవఁట మంచి చతురుఁడవఁట!
ఖ్యాతికినిఁ దగ్గ చేతలే? ధాత! నీకు
మొదలె ఛాందసుఁడవు గదా! ముదిమి మదియె
చెడెనొ? మాయమ్మ శారద చెప్పలేదొ? ౭౮

సీ. అఖిల లోకముల కిష్టార్థంబులిచ్చి నీ
తల్లి శ్రీలక్ష్మి రంజిల్లుచుండ
ఆప దోద్ధారకుండై దయాళుండు నీ
తండ్రి చక్రధరుండు తనరుచుండ
సరసుండు సుకుమారి స్మరుండు నీతమ్ముండు
మిథునంబులను గూర్చి మెరయుచుండ
ఆశ్రితావలికి విద్యాబుద్ధులిచ్చి నీ
దేవి వాగ్దేవి వర్థిల్లుచుండ

గీ. అల్మగల నెడఁబాపి సౌఖ్యముల జోపి
శోకముల ఁబాపెదవె! దయాశూన్యహృదయ!
తెలియవో గాక యీ కొలదీగుదాక
నీ కపూజ్యతసుమ్మ! నాళీకజన్మ! ౨౯

సీ. వేల్పుల పెద్దవై వెలసినట్టి ఫలంబు
జన్నిగట్టై వన్నెఁగన్న ఫలము
చదువుల వేల్పువై చతురుఁ గన్న ఫలంబు
బంగారు బొజ్జ చెలంగు ఫలము
సత్యలోకము నేలు సౌరు గన్నఫలంబు
చతురాననుఁడవై యెసంగు ఫలము
జాతకంబులు వ్రాసి ఖ్యాతిఁగన్న ఫలంబు
భారతీశ్వరుఁడవై పరగు ఫలము

గీ. యువతుల ననాథలను జేసి యుసురువెట్టి
నిష్ఫలముఁ జేయుచున్నావు నిజము నీవు
నలిననాభుని నాభినే నెలసినావొ?
నాభినే పుట్టినావొ? ఓనాభిజన్మ! ౩౦

సీ. ధీమంతులార! సుధీంద్రులారా! యతి
బాల్యవివాహమున్ బాపరయ్య!
కవిరాజులార! సత్కర్మలారా! యతి
బాల్యవివాహమున్ బాపరయ్య!
సదయహృదయులార! సరసులారా! యతి
బాల్యవివాహమున్ బాపరయ్య!
నాగరక జన రత్నంబులారా! యతి
బాల్యవివాహముఁ బాపరయ్య!

గీ. కాశ్యపీసుర రాజన్య వైశ్య శూద్రు
లార! పుణ్యాత్ములార! యీ ఘోర దుఃఖ
భాజనము నతిబాల్య వివాహమింకఁ
బాపరే! పాపఁగదరయ్య!! పాపరయ్య! !!! ౩౧

సీ. ఆలినిఁ గోల్పోయి యాత్మకన్యలమార్చి
మరలఁ బెండ్లాడు కాపురుషులార!
నగలకై కూఁతుండ్రఁ దెగనమ్మి సిగ్గటి
తులికెడు గయ్యాళి కొమ్మలార!

అల్లుండ్రయి యాఁడెల్ల గుల్లలు గావించి
యప్పు దీర్చుకొను నీచాత్ములార!
నరమాంస మమ్మి ధనముఁ గూర్చి గర్వించి
చరియించు లుబ్ధకజనములార!
గీ. వృద్ధధనికులకు సుతల నిచ్చి వారి
మృతికిఁ గాచుక యుండెడు హీనులార!
ఆత్మకార్య ధురంధరులార! మీకు
మంచి కాదిది! యికనైన మానరయ్య! ౨౨

సీ. కులకాంతతోఁ గూడి కులికెడు వానికి
విధురుని చింత లే విధిసెఁ దెలియుఁ
దులలేని సిరులతోఁ దులదూగు వానికి
నిరుపేద కష్ట మేకరణిఁ దెలియు
స్వాతంత్ర్య భూతి విస్ఫీతుఁడౌ వానికి
బానిస బెడఁద ప్రభాతిఁ దెలియు
భూసురుఁడై పుట్టి మురిసెడు వానికి
మాలని దొసఁగు లేమాడ్కిఁ దెలియుఁ
గీ. ప్రాణపతితోడ సుఖియించు భాగ్యవతికి
బాల విధవల దుఃఖ మేభంగిఁ దెలియు
నింగిత జ్ఞాన మించుకంతేని లేక
నోరికొలఁదులు నుడువుచున్నారు గాక ౨౩

అకటా! "పరోపకారార్థంశరీర" మను
మాటఁ దలంచుఁడో మాతలార!
వాత్సల్యమున "నాత్మవత్సర్వ భూతాని"
యను పల్కు నెంచుఁడో యవ్వలార!
సదయాత్ములై "యహింసాపరమోధర్మ"
యనుసూక్తి భావించుఁ డంబలార!
నిరతంబుఁ "బాపాయ పరపీడన" మ్మంటఁ
దగ విచారించుఁడో తల్లులార!
గీ. బాలికల నిట్లు దుఃఖాబ్ధి పాలుచేయు
పురుషులకుఁ గష్టసుఖములు బోధచేసి
శిశువులకు బొమ్మపెండ్లిండ్లు చేయకుండ
నడ్డుపడరమ్మ! మీరైన నమ్మలార! ౨౪

సీ. జాత్యభిమానంబు సర్వంబు విడనాడఁ
దగవుగాఁ దోఁచెనే మగువలార?
కన్నబిడ్డలమీఁద కరుణను విడనాడఁ
జెల్లునే యిటు మీకుఁ జెలువలార?
నయహీనలై భూతదయ వీడనాడంగ
ధర్మమార్గంబౌనె తరుణులార?
స్వప్రయోజన పరత్వమునఁ గన్నెల నిట్లు
హింసింపఁ బాడియే యింతులార?

గీ. కన్నతల్లులె పిల్లలఁ గావకున్న
దిక్కు వేఱెవ్వ రున్నదే తెలుపలార?
వ్యాఘ్రములకన్న ఘోర సర్పములకన్నఁ
గ్రూరమతులైతి రేమమ్మ! కొమ్మలార! ౭౪

సీ. ఆడువార లనంగ నస్వతంత్రు లటంచు
వాదులాడుట వట్టి సోదిగాదె?
ఆడుదే గృహరాజ్య మరలేక పాలించు
రాణి యంటయె సత్యవాణిగాదె
ఆడుది గట్టిగా ననుకొన్న కార్యంబు
జరుగని దొక యుదాహరణ కలదె?
ఆడుదానిష్టంబు ననుసరింపక యింటి
వాఁడుచేసెడి దొక్కపనియు గలదె?
గీ. ఆడువారల కష్టంబు లాడువారె
చూడకుండుట మానోము సొంపుగాదె?
గట్టిగా మీరు తలఁచిన గడియలోనె
తప్పవే మాకు కష్టాలు తల్లులార! ౭౫

సీ. కన్నబిడ్డలనమ్మి కడుఁ బాతకముఁ గట్టు
కొనఁబోకుడయ్య యోయనఘులార!
పసిపాపలను బట్టి ముసలివారికిఁ గట్టి
యులయింపఁబోకుఁడో యయ్యలార!

పుత్రికలను గూడ బుత్రులఁ గనుజాడ
దయతోడఁ జూడుఁడో తండ్రులార!
నోరుమాలిన నిసుంగుల నేచిన యుసురు
తగులక తప్ప దోసుగుణులార!
గీ. బాలవిధవలు నిత్యంబుఁ బడెడి పాట్లు
సుంత తలపోయుఁడయ్య! యోసుజనులార!
మాగతియె మీకుఁ బట్టిన మదికి నెట్టు
లుండునో యెంచుఁడమ్మ! యో యువతులార! ౭౬

మన దేశ జనసంఖ్య ఘన వృద్ధిఁ గనకున్న
హేతువదేమొ యూహింపరయ్య?
పరదేశములలోని ప్రజ లసంఖ్యాకులై
సుఖియించు కతమేమొ చూడరయ్య?
ఆఁడువారల వీడ నాడినచో సంఘ
బలము తగ్గునొ లేదొ తెలియరయ్య?
చిరవియోగంబున జీర్ణింప స్త్రీలోక
మౌన్నత్య మెటులబ్బు నరయరయ్య?
గీ. పురుషులును స్త్రీలు నైక్యంబుఁ బొరయకున్నఁ
బూజ్యమైన స్వాతంత్ర్య స్వరాజ్యములను
బడయు టెట్టులో మీరలే నుడువరయ్య!
పుణ్యజనులార! భారతపుత్రులార! ౭౭

సీ. సీత తా నెంతటి పూతచరిత్రయో?
ద్రౌపది యెంత విద్వాంసురాలో?
సావిత్రి యెంతటి సద్గుణవతియొక్కొ?
విదుల తా నెంతటి వీరమతియో?
సుమతి తా నెంతటి శుద్ధచరిత్రయో?
సత్య యెంతటి సాహసాత్మురాలో?
దమయంతి యెంతటి ధైర్యసమేతయో?
చంద్రమతి యదెంత సాధ్వియొక్కొ?
గీ. అంతవారల మముఁ జేయరయ్య! రాజ
క్రియములతోడ నాత్మ సాంఘికములెల్ల
సంస్కరించుట లెస్స యేసరణినైన
మాన్యులార! స్వదేశాభిమానులార! ౮౯

సీ. కాంతామణుల వేఱుగా గణించుట స్వదే
శాభిమానులకు న్యాయంబు కాదు
అనదల యాపద లణఁపకుండుట స్వదే
శాభిమానులకు భావ్యంబు కాదు
అర్ధాంగు లగు స్త్రీల నసదు చేయుట స్వదే
శాభిమానులకు శ్రేయస్సు కాదు
స్త్రీల బాసల రీతిని దలఁచుట స్వదే
శాభిమానులకు మాన్యంబు కాదు

గీ. స్త్రీల బాసట లేకున్న దేశ మెపుడు
సున్నతికి రాదు కావున యువతిమణుల
గోడుడిపి మీఁదఁ గాలానుకూలశక్తికిఁ
బూనఁగదరయ్య! దేశాభిమానులార! ౯౦

సీ. కూర్మిమై మీ బాగుఁ గోరువారము గాని
చలము సాధింప శత్రులముగాము
పనిపాటులందుఁ దోడ్పడువారముగాని
యలయింపఁగాఁ జెనంటులముగాము
పురుడింప మీతోడఁ బుట్టువారముగాని
వెలిఁ జేయ లాతివారలముగాము
భాగ్యభోగ్యముల మీపాలివారముగాని
తలపోయఁ దేరవారలముగాము
గీ. తెగువఁజూపక మామీఁది పగనువిడిచి
సాదరంబున మముగాంచి సమత నెంచి
కరుణ మదినుంచి మమ్ములఁ గావరయ్య!
పురుషవరులార! యోపుణ్యపురుషులార! ౯౧

సీ. భ్రూణహత్యల మాన్పు పుణ్యంబు లభియించుఁ
గూనల పెండ్లిండ్లు మానరయ్య!
పుత్రిదానముఁ జేయు పుణ్యంబు లభియించుఁ
గూనల పెండ్లిండ్లు మానరయ్య!

పురుషభిక్షముఁ బెట్టు పుణ్యంబు లభియించుఁ
గూనల పెండ్లిండ్లు మానరయ్యా!
పొలతుల బ్రతికించు పుణ్యంబు లభియించుఁ
గూనల పెండ్లిండ్లు మానరయ్యా!

గీ. అకట! పిచ్చుకపైఁ జంద్రహాసమట్లు
లబలలము మీకు మాపయి నలుక యేల?
మమ్ము గణియించి చేపట్టి మనుపరయ్యా!
పురుషవరులార! యో పుణ్యపురుషులార! ౯౧

సీ. నిండారు దయతోడ నిలువనీడలుగాగ
శరణాలయంబు లేర్పరుపరయ్యా!
హృద్యవిద్యలనేర్పి వృత్తులఁ గల్పించి
జీవనోపాధులఁ జేర్పరయ్యా!
పరిణయవాంఛచేఁ బరితపించెడువారిఁ
గోరిన వరులతోఁ గూర్పరయ్యా!
శమదమాదులఁ దపశ్చర్యఁ బూనినవారిఁ
బెంపారు భక్తిఁ బూజింపరయ్యా!

గీ. దైవదత్తంబులైన స్వాతంత్ర్యములను
భోగభాగ్యంబులను సమభాగమిచ్చి
సోదరీరత్నములనెల్ల నాదరించి
పుణ్యకీర్తులఁ గొనరయ్యా! పురుషులార! ౯౨

సీ. దేశంబు మిగుల వర్ధిల్లి చక్కఁగా శుభో
దయమంద మదులందుఁ దలఁతురేని?
మేదిని సారసమృద్ధమై తెస్సగా
ఫలియింప మదులందుఁ దలఁతురేని?
కాటకంబు మశూచికముఁ గలరా ప్లేగుఁ
బోలియంగఁ మదులందుఁ దలఁతురేని?
కుంభవృష్టిగ సదా గోవులు పాలీయ
నెలమితో మదులందుఁ దలఁతురేని?

గీ. బాల్యవైవాహికములను బాపరయ్యా!
బాలవిధవలకన్నీరు పడినయంత
వఱకు దేశంబు లేశంబు బాగుపడదు
కాన బాల్యవివాహముల్ మానరయ్యా! ౯౩

సీ. అమ్మరో! నాపెండ్లియగు టెన్నఁడే యన్న
కూఁతుమాటలు విని కుంది కుంది
అవ్వరో! నామగండెవ్వరో చెపుమన్న
వలవలకన్నీరు వంచి వంచి
మగఁడువచ్చునె! చాలనగలు తెచ్చునె! యన్న
పలుకులాకర్ణించి వగచి వగచి
ాయనంబున కల్లవారియింటికిఁ దోడ
నేగుదెంచెదనన్న నేడ్చి యేడ్చి

గీ. తనయ యవ్యక్తవాక్యముల్ దలఁచి తలఁచి
యక్కటా! యంచు హా! దైవమా! యటంచు
వనఁటనొంది యలో! హాలో! యనుటకంటెఁ
గూనలకుఁ బెండ్లిసేయుట మానరాదె? ౯౪

సీ. కల్యాణవేళ మంగళసూత్రమును గట్టు
తరుణంబునందు సీతాయిమగఁడు
సాపడకున్కి స్థాలీపాక మొనరించు
తఱియందె యల్ల చంద్రిమ్మమగఁడు
పాకెన్ననాఁడు సంభావనల్ విప్రిమం
డలి కిచ్చువేళ మీనాక్షిమగఁడు
నాకబలియొనర్పు నాఁటి సంకల్పమా
రంభించునపుడె భద్రాంబమగఁడు

గీ. పదియు నాఱవ పండుగ గదియుమున్నె
దేవదేవిమగండు గతించెననుచు
నురములను మోఁదుకొనుచు వందురుటకంటెఁ
గూఁనలను వృద్ధులకు నీయమానరాదె? ౯౫

సీ. పేదరైతుల నేడిపించు దుష్టోద్యోగి
కొనఁడొకో? వందలకొలఁది ధనము
పడుపుఁదనంబుచే గడనకిత్తియలెల్లఁ
గూడఁ బెట్టరె? వేలకొలఁది ధనము

కటికితనంబుచే గాయికసాయీలు
కూర్చరో? లక్షలకొలఁది ధనము
దారులుగొట్టి బల్ దారుణగతి దొంగ
కొనిపోఁడొకో? కోట్లకొలఁదిధనము

గీ. కీర్తికినిఁగాని ధనమేల? కిల్బిషాగ్ని
కింధనంబును నిహపరబంధనంబు
దంధనంబట్టి ధనముకై తగవుమాలి
కూనలను విక్రయింతురే? కుమతులార! ౯౬

సీ. బాలవితంతు దుర్భర దుఃఖమును విన్న
గండశైలంబైనఁ గరఁగకున్నె?
బాలవితంతు దుర్భర దుఃఖమునువిన్న
బోయకైనను జాలిపుట్టకున్నె?
బాలవితంతు దుర్భర దుఃఖమును విన్న
గటికివానికి దయ కలుగకున్నె?
బాలవితంతు దుర్భర దుఃఖమునువిన్న
ఖలుడైనఁ గన్నీరు గార్చకున్నె?

గీ. మెత్తపడకున్నదార ! మీచిత్త మెట్టి
గట్టియినుమున ఘనవజ్రఖండమునను
జేసెనోగాని యల్ల రాజీవభవుఁడు
పితమతులార! ఛాందస విప్రులార! ౯౭

అగ్ని హోత్రము వైచి యంభోధి జలమింకఁ
జేయఁ బూనెడు మూఢచిత్తుఁడైన
ఖరవాల మూఁతగాఁ గైకొని పాథోధి
నీద సెంచెడు బుద్ధిహీనుఁడైన
క్షీరమేళనచేఁ బయోరాశి క్షారత
మాన్ప నూహించెడు మందుఁడైన
బడబానలంబును బట్టంగఁ దలపోసి
జలధిలో నుఱుకు నజ్ఞానియైన

గీ. క్షుద్రతరకన్యకా వరశుల్కములును
బాల్యవిషమవివాహముల్ బాగటంచుఁ
బలుకఁజాలఁడు మీవంటిప్రాజ్ఞుల కివి
తగవు మానుఁడు! ఛాందసోత్తంసులార!

ఆమయం బణఁప సిద్ధౌషధం బగునంచు
విషముఁ గ్రోలఁదలంచు వెఱ్ఱియైన
ఘనమైన నీరువట్టును దీర్చుకొన నెంచి
కేయిదాఁ ద్రెవెడు నవినీతుఁడైన
నేల నింగియుఁ బట్టి తాళంబు వాయింప
మానసంబునఁ గోరు మందుఁడైన
బలురోసమునరొప్పు పులిమీసములఁబట్టి
వేలాడఁ బూనెడు బేలయైన

గీ. క్షుద్రతరకన్యకా వరశుల్కములును
బాల్యవిషమ వివాహముల్ బాగటంచుఁ
బలుకఁజాలఁడు; మీవంటి ప్రాజ్ఞుల కివి
తగవు మానుఁడు! ఛాందసోత్తంసులార! ౧౦౦

సీ. అతిబాల్యమున వివాహములు చేయుమటంచు
నార్యు లెందుననైన నాజ్ఞ యిడిరె?
వేదంబులందైన విధియింపఁ బడియెనే?
స్మృతులయందెందైనఁ జెప్పఁబడెనె?
మనపూర్వు లెప్పుడైన నొనరించియుండిరే?
యేదేశమందైన నిట్టులు కలదె?
ఈ దేశముననైన నెల్లవర్ణంబుల
వారొప్పి చేయుచున్నారె యెందు?

గీ. లోకవిపరీతమై మఱి లోకవృద్ధి
భంగకరమైనపని చేయఁ బాడి యగునె?
మదిని దయఁదాల్చి యీకీడు మాన్పరయ్య!
ధరణిసురులార! ధర్మావతారులార! ౧౦౧

సీ. జాతిసాధనముకై జాతులఁ గల్పించి
యేకత్వమును బ్రతిష్ఠించినారు
రాజనీతి రచించి రారాజుల సృజించి
లీలతో విశ్వ మేలించినారు

సర్వసమత్వ మాచరణచే బోధించి
యెల్లమానవుల మెచ్చించినారు
ఇంద్రియంబుల గెల్చి యిచ్చ లెల్లను డుల్చి
శాంతజీవనవృత్తి జరిపినారు
గీ. భోగముల నెల్ల విడిచి విరాగులగుచు
నెల్ల సంపద లితరుల కిచ్చినారు
భూసురులు తొల్లి సద్ధర్మ భాసురులయి
జడత చెల్లునె? మీకు ద్విజన్ములార! (౧౨

ప్రతిలేని ప్రతిభచేఁ బ్రజ్ఞాన నిధులుగా
వేదశాస్త్రములు కావించినారు
ఉపనిషత్తులలో నిరుపమాన యుక్తిచేఁ
బరతత్త్వమును దేటపరచినారు
అఖిల శాస్త్రములు జిహ్వాగ్రంబుల వహించి
శేముషిచేఁ బ్రకాశించినారు
సకల విద్యాసార సత్రముల్ నెలకొల్పి
విజ్ఞానసుధఁ బంచిపెట్టినారు
గీ. దివ్యమహిమలు గలిగి వర్ధిల్లినారు
భూసురులు తొల్లి సద్ధర్మ భాసురులయి
వారి సంతతి వారలై మీరు నీత
తేజులై యుందురే? ద్విజరాజులార! ౧౩

సీ. కాలానుకూలంబుగా లోకవిజ్ఞులై
సంఘసంస్కరణంబు సలుపరయ్య!
అంత్యజులటంచుఁ బ్రాయశ్చిత్తములటంచు
లోకుల బెదరింపఁ బోకుడయ్య
పాదభిక్షులటంచు బీదలఁ బీడించి
విత్తంబుఁ గూర్చుట విడువరయ్య!
బాలవితంతువుల్ పడునట్టి పాట్లెల్ల
నెల్లవారలకు బోధింపరయ్య!
గీ. మాదుదుస్సహ దుఃఖముల్ మాన్పరయ్య!
పక్షపాతంబు మీకేల? వదలరయ్య!
భూసురోత్తములార! సన్యాసులార!
ధీరవరులార! పీఠాధికారులార! (౧౪

సీ. మున్ను పెద్దలు చేసియున్న యాచారాలు
మా కర్మవశమున మారెగాక
ఇచ్ఛకాలై వివాహంబులు చెల్లవే?
నిర్బంధములు వచ్చె నేఁడుగాదె?
బ్రహ్మచారులవలె బ్రహ్మచారిణులును
వేలాదిగా తొల్లి వెలయలేదె?
బ్రహ్మవాదినులైన బ్రహ్మచారిణులను
పెద్దలందరు గౌరవింపలేదె?

గీ. స్త్రీలకు స్వయంవరంబులు చెల్లలేదె!
నేటికి మనీషగోల్పోయి పాటిదప్పి
తప్పుదారుల జరియించి యొప్పుదరిగి
తెలియరో గాక ద్విజకుల తిలకులార! ౧౦౫

సీ. అందరు యోగినులై చరింపగ లేరు
బ్రహ్మచర్యంబు పైపయిని లేదు
ఇంద్రియ నిగ్రహంబెంత వారికి గల్గు
భక్తి పుట్టుకతోనె పట్టువడదు
యతికైన వైరాగ్య మతి దుర్లభంబౌను
చలచిత్త మొకమాత్ర జక్కబడదు
అనుభవింపక యిచ్ఛ యణగాగునది కాదు
బుద్ధి యాంకెకుగాదు బోధవలన
గీ. శీలరక్షకు జాలు వశిత్వసిద్ధి
సాధనలవల్ల పూర్వ వాసనలవల్ల
గాని యావశ్యకము జూచి కలుగదెపుడు
గాన నిర్బంధ పద్ధతి మానరయ్య! ౧౦౬

సీ. నిర్బంధములఁ బెట్టి నిలిపిన మాత్రాన
మామనోరథములు మరలునొక్కొ?
కట్టుఁబాటులు చేసి కష్టపెట్టిన మాత్ర
మాయభిలాషముల్ మాయునొక్కొ?

మారూపు రేఖలు మార్చి వేసినమాత్ర
మాకోరికలు మాటుమణుగునొక్కొ?
మమ్మొక్క ప్రొద్దుల మాడ్చిన మాత్రాన
మాయిచ్ఛలు కృశించి మరుగునొక్కొ?
గీ. కలుగనేరాదు కాంక్షలు కలిగెనేని
ననుభవింపక నశియింప వజునికైన
నేల నిర్బంధ నరకాలపాలు చేసి
యేడిపించెదరిఁక జాలి జూడరయ్య! ౧౦౭

సీ. సృష్టి వైఖరిజూడ శృంగారమే తోఁచు
శుక శారికాదుల సొలపె తోఁచు
హరిణాదులను మనోహరలీలలే తోఁచు
దరులతాదుల స్నేహసరణి తోఁచు
సీమ జోడులఁ జూడ వేడుకలే తోఁచు
జుట్టాల వగఁ జూడ సొగపె తోఁచుఁ
దోడుల జాడలఁ జూడ ముచ్చటె తోఁచుఁ
దలిదండ్రులెడఁ జూడఁ దమియె తోఁచు
గీ. నెల్ల వాతావరణ మిట్టు లీకభంగిఁ
జిత్తములఁ గోరికల పేరి చిచ్చు రేపి
నిలువున దహించుచుండంగ నిమిషమైన
మది నిలుప శక్యమో? బాల విధవ కకట! ౧౦౮

సీ. రంగుచీరలు దాల్ప రాదంటిరే గదా
విధిగ నెందరు మాని వేసినారు?
రైకలు ధరియింప రాదంటిరే గదా
విధిగ నెందరు మాని వేసినారు?
ముప్పూట భుజియింపఁ బోలదంటిరి గదా
విధిగ నెందరు మాని వేసినారు?
పుష్పాలు ముడువంగఁ బోలదంటిరి గదా
విధిగ నెందరు మాని వేసినారు?
గీ. కురులు పెంచుకొనట కూడదంటిరి గదా
విధిగ నెంతమంది విడిచినారు
ఎవరు నొల్లనట్టి యీ ఘోర నిర్బంధ
విధులిఁకేల? తీసివేయరయ్య!

సీ. బాల్యంబుననె భర్తఁ బాసిన బాలిక
చేఁ గల్గుచేటు వీక్షింపరయ్య
తమకంబు మించి డెందంబు నిల్పంగలేక
స్వచ్ఛందవృత్తియం దిచ్ఛమీఱు
విజాతి యెవ్వరితోనో కేరి కేళినిఁ దేలుఁ
దేలిన యామీఁదఁ జూలునిల్చు
నిల్చినంతనె లోకనిందకు భీతిల్లి
భ్రూణహత్యలఁ జేయ బుద్ధిఁ బొన్పు

గీ. తనకు బంధువులకుఁ దల్లిదండ్రులకును
నత్తమామలకును నపయశముఁ దెచ్చు
కులము మానంబుఁ గూలిచి గోడుఁగూర్చుఁ
జివర కిహపరములకును జేటుఁ దెచ్చు! ౧౧౦

సీ. మన వివాహంబుల మంత్రాల యర్థంబు
నించుకైనను విచారించరాదె!
మనుధర్మశాస్త్ర మేమనుచు బోధించునో
యదియైనఁ జింత సేయంగరాదె?
దేశకాలములఁ జింతించి ప్రస్తుత మేది
యనుకూలమో దానిఁ గొనఁగరాదె?
ఎల్లదేశములవా రీవివాహము లెట్లు
లాచరింతురో దాని నరయరాదె?
గీ. బాల్యవైవాహికంబులవల్లఁ గలుగు
మాలకూటికంటెను గడు మేలుకాదె?
పుష్పవతులైన యందాకఁ బువ్వుఁబోండ్ల
నుంచి పెండ్లిండ్లు సేయంగ నొప్పరాదె? ౧౧౧

సీ. రమణీవినాశ కారణమైన సహగమ
నాచారమును వీడనాడలేదొ?
బలిపేర మనుజులప్రాణాలఁ దీయు క్రూ
రాచారమును వీడనాడలేదొ?

కన్నసంతానంబు గంగపాల్సేయు ఘో
రాచారమును వీడనాడలేదొ?
బహుహేయతమమైన వల్లభాచార్య మ
తాచారమును వీడనాడలేదొ?
గీ. జనులలో నాగరికత హెచ్చిన కొలంది
సంస్కరించిరి మును దురాచారములను
బ్రాజ్ఞు లీయతి బాల్యవివాహములను
మాన్పఁగదరయ్య! వేవేగ మాన్యులార! ౧౧౨
సీ. పరికృతిశాస్త్రజ్ఞులు భావించి వలదంచు
ఘోషించుచుండ నూకొనఁగరాదె?
వైద్యశాస్త్రజ్ఞులు వరుసతోఁ దగదంచు
బోధించుచుండ నొప్పుకొనరాదె?
లోకజ్ఞులందఱు నేకభంగినిఁ గూడ
దని మొత్తులిడుచుండ వినఁగరాదె?
నవసంఘసంస్కర్త లవివేక మిదియంచు
వాదించుచుండఁగా వదలరాదె?
గీ. పూర్వనియమంబులని చేసి యోర్వరాని
బెడఁదలను దెచ్చిపెట్టి మీబిడ్డలకును
జూడఁజాలక వలపోయు గోడుకంటె
బాల్యవైవాహికంబులఁ బాపరాదె! ౧౧౩

తనదు పెండ్లియటంచుఁ దనముగం డితఁడంచు
నెంచియైనను సంతసించవచ్చు
పెండ్లిలోపలనైనఁ బెనిమిటిపొత్తున
భుజియించి ముచ్చటఁ బొందవచ్చు
అలుకపాన్పునఁ జేరునపుడైన భర్తకుఁ
దెలనాకుమడుపు లందింపవచ్చు
తమిఁ బునస్సంధాన సుముహూర్తముననైనఁ
బతితోడ శయ్యపైఁ బండవచ్చు
ఆ. తనివి దీఱ మగనిఁ గనియైనఁ గొన్నాళ్ళు
మనసుగొంత దీర్చుకొనఁగవచ్చు
యువతులకు వివాహ మొనరించితిర యేనిఁ
గాన స్త్రీలఁ గరుణఁ గానరయ్య! ౧౧౪
సీ. స్మృతిశాస్త్రశ్రుతిపురాణేతిహాస నికాయ
మిది యుక్తమంచు ఘోషించుఁగాక
ఆబాలగోపాల మఖిల మానవకోటి
యిది మేలటంచు భాషించుఁగాక
బాంధవ వణిజ హితాప్త పురోహిత శ్రేణి
యిది తప్పదంచు వేధించుఁగాక
కల మత పరితతి యేకగ్రీవముగ నొత్తి
యిది ధర్మమంచు బోధించుఁగాక

గీ. వెతలు తనకెన్నియో సంభవించుఁగాక
దంపతులకెల్ల దుఃఖ సంధాయకములు
చిన్నపిల్లల పెండ్లిండ్లు చేయరాదు
ధరణిసురులార! యీనీతిఁ దలపరయ్య! ౧౧౪

సీ. నీతిదృష్టికి బక్షపాతంబు గాదొకో?
స్త్రీలకు మార్పెండ్లి చెల్లదన్న
నవనాగరికతకు నష్టంబు గాదొకో?
యీదేశనియమంబు గాదటన్న
ప్రకృతి ధర్మము భంగపాటొందదొకో? బాల
విధవ భోగములకు వెలియటన్న
దైవసృష్టికి విరోధమ్ము గాదొకో? సం
తతి బాలవిధవకుఁ దగదటన్నఁ

గీ. చేటుగుంగని ఛాందసుల్ చెప్పునట్టి
ధర్మములు దాటరాదని తలఁపబోక
విధవలను సధవలను గావింతురేని
శ్రేయమగు నన్నలార! యోజింపరయ్య! ౧౧౫

సీ. మగవారు బొడ్డున మాణిక్యములతోడఁ
బుట్టిరే మేమట్లు పుట్టలేదె?
భోగముల్ పొందంగఁ బురుషులే యోగ్యులే
యబలల కట్టి యోగ్యతయె లేదె?

మగవారలకు మారుమనువు న్యాయంబైన
నాడువారలకు న్యాయంబు కాదె?
పురుషులకొక ధర్మమును స్త్రీలకింకొక్క
ధర్మంబనుట విరుద్ధంబు కాదె?

గీ. దైవముఖమును జూచిన ధర్మమేదో
తోచదే దుఃఖవారాశి దోగుచున్న
మాకు గలిగిన యాపద మానిపించి
శాశ్వత యశస్సు గనరే ద్విజన్ములార! ౧౧౬

సీ. లతకూనలను గళాన్వితలను గావించి
జ్ఞానమిచ్చుట తప్పుగాదుసుండు!
తలిరుబోణులకు స్వాతంత్ర్య భాగ్యమొసంగి
గారవించుట తప్పుగాదుసుండు!
అతివలకీడేరునందాక వైవాహి
కమ్ముఁ జేయమి తప్పుగాదుసుండు!
వలసిన విధవ కుద్వాహంబుఁ గావించి
యాదరించుట తప్పుగాదుసుండు!

గీ. విశ్వమానవ సహజంబు లీశ్వరప్ర
సాదితము లుత్తమాంగ రక్షణాచణములు
కేవలము పాణిపదములో కేశములను
ఖండనముఁ జేయమియ్యుఁ దప్పుగాదుసుండు! ౧౧౭

సీ. సంగీతమందును సాహిత్యమందును
శీలసంపదయందుఁ జిన్నెలందు
చక్కఁదనమునందు జవ్వనంబందును
బలమునందును బుద్ధిబలమునందు
సద్గుణంబులయందు సరసతయందును
వీన మొండొరులకుఁ దీసిపోక
తనువులు రెండుగాఁ దనరారుచున్నను
[illegible]భావములందు నేకమగుచు
గీ. వలతితనముల నన్యోన్య వశ్యులగుచుఁ
జిరతరాయువు సంతతి సిరియుఁ గలిగి
సౌఖ్యకీర్తుల నోలాడు సతులుఁ బతులుఁ
గలిగి భారతవర్షంబు చెలఁగుఁగాక! ౧౧౯

సీ. సకలవిద్యలు నేర్పి స్వాతంత్ర్యములనిచ్చి
స్త్రీలఁ బూరుషు లాదరింత్రుగాక!
దంపతులకు సౌఖ్యదంబులై యలరారు
ప్రౌఢా వివాహముల్ ప్రబలుగాక!
చత్వారికల పెండ్లి సర్వసమ్మతమగు
భ్రూణహత్యలు లేకపోవుగాక
శ్యామలందరు నిత్యసౌభాగ్య భాగ్య సం
శోభితలై సుఖించుదురుగాక!

గీ. అసమ వైవాహికములెల్ల నణఁగుఁగాక!
కన్యాశుల్కములు గంగఁ గలియుఁగాక!
పురుషభరణంబులును మాసిపోవుఁగాక!
ఎల్లశుభములు నిండు వర్ధిల్లుగాక! ౧౨౦

సీ. శారద మైత్రేయి సరసవాణుల మించు
ఘన విదుషీమణీ గణముతోడ
సతి యరుంధతి సీత సావిత్రి యనసూయ
లని యెన్నఁదగు సతీమణులతోడ
విదులాంబ కుంతి ద్రౌపది జిజా మల్లమ
లకు సాటి వీరమాతృకలతోడ
సత్యభామ సుభద్ర ఝాన్సి రుద్రమ లట్టి
వీర నారీమణీ వితతితోడ
గీ. నాచి వెంగమ మొల్లలఁ ద్రోచిపుచ్చు
సరస కవితా రమాధురంధరలతోడ
భాగ్యములతోడ శుభపరంపరలతోడ
భరతఖండంబు సర్వదా మురియుగాక! ౧౨౧

సంపూర్ణము.

శ్రీ సౌదామినీ ప్రెస్, తణుకు.

END OF
TITLE